సాక్షి
ప్రకాశం
సోమవారం । 9 । అక్టోబర్ । 2023





**నేనున్నాను..!**
కుమారుడికి కిడ్నీ దానం చేసి ఆ తల్లి ప్రాణంపోస్తే.. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు మొత్తాన్ని భరించడంతో పాటు ఆ కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి ఆదుకున్నారు సీఎం జగన్. - 8లో..



**మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం**
ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డుల గురించి సీఎం సానుకూలంగా ఉన్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36.5/27.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత అధికం. వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి.

## న్యూస్‌రీల్

### మెడికల్ రిప్రజెంట్స్ కలిసి రావాలి



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఒంగోలు టౌన్:** మెడికల్ సేల్స్ రిప్రజెంట్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ అధ్యక్షుడు చిరంజీవి పిలుపునిచ్చారు. యూనియన్ 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఏనుగుచెట్టు దగ్గర ఏపీఎంఎస్ఆర్‌యూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా నవంబరు 30న దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒకరోజు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సాధారణ ప్రజలు వాడే ఔషధాల ధరలను నియంత్రించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణమోహన్, నరసింహ, బాషా, సురేంద్ర, వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌ఐఓ కార్యాలయంలో మార్కుల జాబితాలు

**ఒంగోలు:** ఇంటర్మీడియెట్ విద్యార్థుల మార్కులు జాబితాలు ఒంగోలు ఆర్ఐఓ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని కాలేజీల ప్రిన్సిపాళ్లు జాబితాలను తీసుకువెళ్లాలని ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సర్టిఫికెట్లను పొందే ప్రక్రియ సులభతరం చేశారని, డీజీ లాకర్ యాప్‌ను రూపొందించి అందులో సర్టిఫికెట్లను ఇంటర్మీడియెట్ ఉన్నత విద్యా మండలి ఉంచిందన్నారు. విద్యార్థుల వివరాలతో కూడిన జ్ఞానభూమి పోర్టల్‌ను డిజిలాకర్‌తో అనుసంధానం చేశారన్నారు. దీనివల్ల 2014 నుంచి 2023 వరకు ఉత్తీర్ణులైన ఇంటర్ విద్యార్థులకు డిజిలాకర్ (వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://డిజిలాకర్.జీవోవి.ఇన్) దోహదపడుతుందన్నారు. మొబైల్ ద్వారా లాగిన్ అయి వెబ్‌సైట్ కోరిన వన్‌టైమ్ పాస్‌వర్డును సమర్పించి ఇతర వివరాలతో పాటు రిజిస్ట్రేషన్ నంబర్ వంటి వాటిని వినియోగించి సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్లు పొందడమే కాకుండా వాటిలో దొర్లిన తప్పులను సవరించుకునే అవకాశం కల్పించారన్నారు. డీజీ లాకర్ యాప్ విధానం గురించి వివరించే వాల్‌పోస్టర్లను జిల్లాలోని అన్ని జూనియర్ కాలేజీలకు పంపించామని, వాటిని బహిరంగ ప్రదేశాల్లో అతికించాలన్నారు. దీనిపై ఆయా కాలేజీల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది విస్తృత ప్రచారం చేయాలని ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్ పేర్కొన్నారు.

### 'మనసు పలుకులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రరసం సభ్యులు

**ఒంగోలు మెట్రో:** మూగబోయిన అంతరంగ భావాలను పలికించేది అసలైన కవిత్వమని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ప్రముఖ కవి చుండూరి శ్రీనివాసరావు రచించిన 'మనసు పలుకులు' ముఖ పుస్తకం ఆవిష్కరణ సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కాలక్షేపం కోసం చెప్పే కవిత్వం కలకాలం నిలబడదని, కష్టజీవుల పక్షాన నిలబడిన కవిత్వం అజరామరం అవుతుందని అన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో 'మనసు పలుకులు పుస్తకాన్ని' అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఫేస్ బుక్ లో వచ్చిన చిత్రాలకు కవిత్వాన్ని అద్ది మనోహరమైన భావాలను తన పుస్తకంలో అందించారని అన్నారు. పుస్తక సమీక్ష చేసిన 'సహజ సాహితీ' అధ్యక్షుడు వడలి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ పుస్తకంలోని ప్రతి కవితలో కవి తన సామాజిక బాధ్యతను ప్రదర్శించారని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, అమృత వర్షిణి అధ్యక్షుడు కేఎస్వీ ప్రసాద్, సాహితీ సుధ కార్యదర్శి పాలూరి శివప్రసాద్, విశ్వ కళా భారతి అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ, అక్షర సాహితీ సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, గంగిశెట్టి నరసింహారావు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు యూనియన్ నాయకులు ఆర్.సంజీవరావు, టీఎస్ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

# స్మార్ట్‌గా పోస్టల్ సేవలు

ఆత్మీయుల ఊసులను అక్షరాలుగా మోసుకొచ్చే ఉత్తరాలకు కాలం చెల్లిపోయింది. అత్యవసర సమాచారం పంపే టెలిగ్రామూ కనుమరుగైంది. దీంతో మసకబారిన పోస్టల్ శాఖకు గత వైభవాన్ని తెచ్చేలా స్మార్ట్ సొబగులను అద్దుతున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వినూత్న పథకాలతో..సత్వర సేవలతో పోస్టల్ శాఖ మళ్లీ ప్రజలకు చేరువవుతోంది. ఇంటింటికీ ఆత్మబంధువుగా మారేందుకు వేగంగా అడుగులేస్తోంది. నేటి నుంచి వారం రోజుల పాటు పోస్టల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. పోస్టల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించారు.

- బ్యాంక్‌లకు దీటుగా ఏటీఎంల ఏర్పాటు
- పోస్టల్ బ్యాంక్ ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ
- మొబైల్ మనీ ట్రాన్స్‌ఫార్మర్, ఎలక్ట్రానిక్ మనీయార్డర్ సేవలు
- జిల్లాలో 3 ప్రధాన తపాలా కార్యాలయాలు
- నేటి నుంచి ఈనెల 13 వరకు పోస్టల్ వారోత్సవాలు



మార్కాపురం ప్రధాన తపాలా కార్యాలయం

**మార్కాపురం:** ప్రజలకు మరింత చేరువయ్యేందుకు పోస్టల్‌శాఖ వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్సు సంస్థల కంటే మిన్నగా ఖాతాదారులకు మెరుగైన ఆర్థిక సేవలు అందించేందుకు సిద్ధమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలంటే గుర్తుకొచ్చేది పోస్టాఫీసులే. మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖ టెక్నాలజీని అందిపుచ్చుకుంది. జాబులు, ఇంగ్లాండ్ లెటర్లు మాయమయ్యాయి. వాటి స్థానంలో సెల్‌ఫోన్ సేవలు వచ్చినా పోస్టల్ శాఖ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు.

ఐకాల్ లెటర్లు, ఇంటర్వ్యూ లెటర్లు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు... వీటిని తీసుకుని ఖాకీ డ్రస్ వేసుకుని ప్రతి రోజు ఉదయం 10 నుంచి 2 గంటల మధ్య ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ అందరినీ పలకరిస్తూ మీకు ఈ లెటర్ వచ్చిందని చెబుతూ ఎందరో ఆశలకు జీవం పోసి ఉత్సాహపరిచే ఆత్మీయులుగా ఉంటారు పోస్టుమాన్‌లు. సుమారు 18 ఏళ్ల కిందట సెల్‌ఫోన్‌లు లేని రోజుల్లో పోస్టాఫీసులు, పోస్ట్‌మెన్‌లు ఆత్మబంధువుల్లా కనిపించేవారు. పిన్ కోడ్‌లో ఉన్న ఆరు అక్షరాల్లో మొదటి రెండు అక్షరాలు రాష్ట్రాన్ని, మధ్యలో ఉన్న రెండు అక్షరాలు జిల్లాను, చివరి రెండు అక్షరాలు ప్రాంతాన్ని తెలుపుతాయి.

**సెల్‌ఫోన్ రాకతో...**

గత 12 ఏళ్లలో సాంకేతికంగా వచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో ప్రజలు సెల్‌ఫోన్ల ద్వారా ఒకరికొకరు మేసేజ్‌ల రూపంలో ప్రస్తుతం వాట్సప్, ట్విట్టర్, టెలిగ్రామ్ ద్వారా సమాచార మార్పిడి చేసుకుంటున్నారు. దీంతో పోస్టాఫీసుకు వెళ్లి ఉత్తరాలు కొని డబ్బాలో వేసే సంస్కృతికి కాలం చెల్లిపోయింది. మనీయార్డర్ల స్థానంలో ఏటీఎంలు, మనీ ట్రాన్స్‌ఫర్ రావటంతో పోస్టాఫీసుకు వెళ్లే వారు కరువయ్యారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాల ఉత్తర ప్రత్యుత్తరాలకు మాత్రమే పోస్టాఫీసును వాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ ప్రజలకు చేరువయ్యేందుకు ప్రవేశపెట్టిన పథకాలతో మళ్లీ పోస్టాఫీసు వైపు అడుగులు పడుతున్నాయి. సాంకేతికంగా వస్తున్న మార్పులను ప్రజలకు అందించేందుకు తపాలాశాఖ సిద్ధమైంది. ఇప్పుడిప్పుడే వినూత్న పథకాలను ప్రవేశపెడుతూ ప్రజలకు పోస్టల్ అధికారులు దగ్గరవుతున్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 9 నుంచి 13 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.



పోస్టల్ ఏటీఎం సెంటర్

**ఇవీ పథకాలు:**

ప్రైవేటు సంస్థలు, బ్యాంక్‌లకు దీటుగా పోస్టాఫీసుల్లో కూడా ఆన్‌లైన్ సేవలు, ఏటీఎంలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే టీటీడీ ప్రత్యేక దర్శనం టికెట్లు, పుష్కరాల సమయంలో ఆ ప్రాంత పుష్కరాలను తెలియజేస్తూ కృష్ణ, గోదావరి, కావేరి, తుంగభద్ర జలాల లీటర్, అర్ధలీటర్ బాటిల్స్ తక్కువ రేటుకు ప్రజలకు అందిస్తూ వారి అభిమానాలను చూరగొంటోంది. మొబైల్ మనీ ట్రాన్స్‌ఫార్మర్, ఎలక్ట్రానిక్ మనీయార్డర్, మై స్టాంప్ పథకం, స్పీడ్ పోస్టుల సేవలు, ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వివిధ వర్గాల ప్రజలు మళ్లీ పోస్టాఫీసుకెళ్తున్నారు. విదేశాల్లో ఉన్న బంధుమిత్రుల నుంచి క్షణాల్లో నగదు బదిలీ, ప్రైవేటు కొరియర్స్ కంటే ముందుగా వెళ్తున్న స్పీడ్ పోస్టు, వ్యక్తిగతంగా మన ఫొటోలతో విడుదల చేసే మై స్టాంప్, రికరింగ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

**ఐపీపీబీతో సేవలు:**

నాలుగేళ్ల కిందట ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్‌ను పోస్టల్ శాఖ ప్రారంభించింది. ఆ శాఖలో ఇదొక విప్లవం. గత ఏడాది జూలైలో మార్కాపురం డివిజన్‌గా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఒంగోలు, పొదిలి, మార్కాపురంలో ప్రధాన తపాలా కార్యాలయాలున్నాయి. మార్కాపురం పరిధిలో రెండు ప్రధాన తపాలా కార్యాలయాలు, 47 సబ్ పోస్టాఫీస్‌లు, 413 బ్రాంచ్‌లు ఉన్నాయి. ఇందులో 1000 మంది ఉద్యోగులు ప్రతిరోజు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న పోస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ మిషన్ అందించారు. దీని ద్వారా బ్యాంకుల్లో అకౌంట్ ఉండి ఐపీపీబీలో అకౌంట్ ఉంటే బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న నగదును మనం కావాలని పోస్టల్ సిబ్బందికి ఫోన్ చేసి చెబితే బయోమెట్రిక్ వేయించుకుని రూ.5 నుంచి రూ.10 వేల వరకు నగదు అందిస్తారు. ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు ఈ పథకం చాలా ఉపయోగపడుతోంది.

**పోస్టల్ పథకాలపై అవగాహన**



ప్రతి ఏడాది అక్టోబర్ 9 నుంచి 13లోపు పోస్టల్ వారోత్సవాలు నిర్వహించి ప్రతి రోజు వివిధ అంశాలపై ఖాతాదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తాం. మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, సేవింగ్స్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవలు, స్టాంపుల కలెక్షన్, సుకన్య సంవృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, మెయిల్స్, పార్శిల్స్ పథకాలపై ఖాతాదారులకు వివరిస్తున్నాం.

– శ్రీనివాస్, పోస్టల్ సూపరింటెండెంట్, మార్కాపురం పోస్టల్ డివిజన్



పోస్టల్ పేమెంట్ బ్యాంక్

# మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆదర్శవంతులుగా నిలవాలి
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్




సంకల్ప్ సప్తాహ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

**యర్రగొండపాలెం:** మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిననాటి నుంచి అనేక పథకాలు ప్రవేశపెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సంకల్ప్ సప్తాహ సమృద్ధి దివాస్‌లో ఆయన మాట్లాడారు. కుటుంబ బాధ్యతలను దిశా నిర్దేశంచేసి చూపిస్తున్న మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ముందుకు వెళ్లాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో పొదుపు గ్రూపులు నిర్వీర్యం అయ్యాయన్నారు. జగనన్న తన సుదూర పాదయాత్రలో మహిళల సాధక బాధలు తెలుసుకున్నారని, 2019 ఏప్రిల్ నాటికి ఉన్న బకాయిలను విడతల వారిగా రద్దు చేస్తామని చెప్పి ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.24 వేల కోట్లను ఆసరా పథకం ద్వారా చెల్లింపులు చేశారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలుగా మహిళలకు అండగా నిలిచిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నగా, తమ్ముడిగా, కుటుంబ పెద్దకొడుకుగా..సేవలందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో 15 మండలాలు యాస్పిరేషనల్ బ్లాక్ కింద ఎంపికైతే, ప్రకాశం జిల్లాలో యర్రగొండపాలెం మండలం ఎంపికకావడం హర్షించదగిన విషయమని అన్నారు. పథకం ఉద్దేశాన్ని మహిళలతో పాటు అధికారులు గుర్తించి ఆ దిశగా ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో మహిళా మార్ట్ కోసం కోట్లాది రూపాయలు విలువచేసే స్థలాన్ని కేటాయించామని, ఆ స్థలంలో రూములు ఏర్పాటు చేసి మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. బహుళజాతి సంస్థల నుంచి రాయితీపై సరుకులు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకునేలా, అందుకు కావలసిన నిధులను సమకూర్చి పెట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల్లో అవకతవకలు జరగకుండా చూస్తామని, అటువంటి పరిస్థితి వచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఆయా మండలాల పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జి.రమణారెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషు, మండల ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, సత్తిరెడ్డి, నాయకులు ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

## వల్లూరమ్మ ఆలయంలో బాలినేని పూజలు



వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

**టంగుటూరు:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ బాలినేనికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలు, శాలువతో సత్కరించారు. అనంతరం జరుగుమల్లి మండలం చింతలపాలెం నాయకులు పల్లా అనురాధ వారి అమ్మవారి మొక్కులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఒంగోలు మేయర్ గంగాడ సుజాత తదితరులు ఉన్నారు.

## రేపు ఆర్చరీ, చదరంగం క్రీడాకారుల ఎంపిక

**ఒంగోలు:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న ఆర్చరీ, చదరంగం క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొనవచ్చు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఎంపిక నిర్వహిస్తారు. స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. పూర్తి వివరాలకు పీఈటీ సోమినేని సురేష్ బాబు సెల్: 9849429839 ను సంప్రదించాలి. ఆర్చరీ సెలక్షన్స్ స్థానిక అద్దంకిలోని ఒలింపియన్స్ స్పోర్ట్స్ అకాడమీ మార్కెట్ యార్డులో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ రాజు, సెల్:8328061914ను సంప్రదించాలి.

# కంప్యూటర్ కోర్సులకే పెద్దపీట

- పాలిటెక్నిక్‌లో మిగిలిన అన్ని విభాగాల్లోను ఖాళీలు
- 4031 సీట్లలో భర్తీ అయినవి 1487 మాత్రమే
- కంప్యూటర్ ఇంజినీరింగ్‌కు అత్యధికంగా 60 శాతం మంది మొగ్గు
- 15 శాతం దాటని సివిల్ ఇంజినీరింగ్ ప్రవేశాలు
- స్పాట్ అడ్మిషన్లపై ఆధారపడుతున్న పాలిటెక్నిక్ కాలేజీలు



ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ

**ఒంగోలు:** ఇంటర్ వైపు విద్యార్థుల ఆసక్తి..కార్పొరేట్ శక్తుల ప్రచారం...పాలిటెక్నిక్ సీట్ల భర్తీపై తీవ్ర ప్రభావాన్నే చూపింది. సాంకేతిక విద్యకు వెన్నుదన్నుగా ఉంటూ స్థానికంగా ఏర్పాటు చేస్తున్న పారిశ్రామలకు అవసరమైన మానవ వనరుల కొరత కనిపిస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 18 కాలేజీలు ఉంటే మూడు కాలేజీల్లో కనీసం ఒక్క సీటు కూడా కౌన్సెలింగ్‌లో భర్తీ కాకపోవడం పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీ పరిస్థితి ఏమిటనేది తెలుస్తోంది. జిల్లాలోని మిగిలిన 15 కాలేజీల్లో ఒక్క కాలేజీలో కూడా వందశాతం సీట్లు భర్తీ కాకపోవడం గమనార్హం.

**కంప్యూటర్ కోర్సులకే ప్రాధాన్యత:**

పాలిటెక్నిక్ ప్రవేశాలను పరిశీలిస్తే జిల్లాలో మొత్తం 8 రకాల కోర్సులకు అనుమతి ఉంది. ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ట్రిపుల్ ఈ, మెకానికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, ఆటో మొబైల్ ఇంజినీరింగ్ ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మాత్రమే ఉండగా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చీరాల ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన పాలిటెక్నిక్ కాలేజీలో మాత్రమే ఉంది.

ఒంగోలు ప్రభుత్వ కాలేజీలో 360 సీట్లకుగాను కౌన్సెలింగ్‌లో 83 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇక అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 99 సీట్లకుగాను భర్తీ అయింది 42 మాత్రమే. కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 123 సీట్లకుగాను భర్తీ అయిన సీట్లు కేవలం 9. ప్రైవేటు కాలేజీల్లో కూడా ఏమీ తక్కువలేదు. ఒక కాలేజీలో ఏకంగా 264 సీట్లకుగాను 5 సీట్లు మాత్రమే భర్తీ కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొత్తపట్నం మండలం ఈతముక్కల ఎస్‌వీయూఆర్ బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో, చీరాల సెయింట్ ఆన్స్‌లో మాత్రమే కంప్యూటర్ ఇంజినీరింగ్, ఈసీఈ కోర్సుల్లో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయి. జిల్లాలో అడ్మిషన్లు జరిగిన 15 కాలేజీల్లోని అన్ని కోర్సుల్లో కలిపి 4031 సీట్లు ఉంటే 1487 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 2544 సీట్లు మిగిలిపోయాయి. కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సుకు 60.36 శాతం ప్రవేశాలుంటే, ఈసీఈకి 54.94 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్‌కు 38.63 శాతం సీట్లు భర్తీ కాగా ట్రిపుల్‌ఈకి 26.02 శాతం, మెకానికల్ ఇంజినీరింగ్‌కు 23.23 శాతం, సివిల్ ఇంజినీరింగ్‌కు 14.87 శాతం, ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌కు 9.09 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

**స్పాట్ అడ్మిషన్లతో కొంత ఊరట**

అడ్మిషన్ల ప్రక్రియలో జాప్యంతో చాలామంది విద్యార్థులు ప్రత్యామ్నాయంగా ఇంటర్‌వైపు వెళ్లిపోయారు. మా కాలేజీలో మొత్తం 360 సీట్లు ఉన్నాయి. కౌన్సెలింగ్‌లో కేవలం 83 మాత్రమే భర్తీ అయ్యాయి. అయితే ప్రభుత్వం తొలిసారిగా స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వడంతో 34 మంది అదనంగా చేరారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కొంత మేరకు కాలేజీలకు జీవం పోసినట్లుగా చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం పెరుగుతున్న పారిశ్రామిక అవసరాలకు తగ్గట్లుగా మానవ వనరులు పాలిటెక్నిక్ ద్వారా భర్తీచేసేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాబ్ మేళాలు చాలామందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. మిగతా కాలేజీల్లో కూడా స్పాట్ అడ్మిషన్లు పెరిగి ఊరట కల్పించాయి.

– పీవీఎల్ఎస్ శివప్రసాద్, డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్

**జిల్లాలో తుది కౌన్సెలింగ్ నాటికి సీట్ల భర్తీ ఇలా**

| కోర్సు రకం | భర్తీ అయిన సీట్లు | ఖాళీగా ఉన్న సీట్లు | మొత్తం సీట్లు |
|---|---|---|---|
| ఆటోమొబైల్ ఇంజినీరింగ్ | 06 | 60 | 66 |
| సివిల్ ఇంజినీరింగ్ | 108 | 618 | 726 |
| ట్రిపుల్ ఈ | 197 | 560 | 757 |
| మెకానికల్ ఇంజినీరింగ్ | 145 | 479 | 624 |
| కంప్యూటర్ ఇంజినీరింగ్ | 597 | 392 | 989 |
| ఈసీఈ | 417 | 342 | 759 |
| ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ | ....... | 66 | 66 |
| కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ | 17 | 27 | 44 |
| మొత్తం | 1487 | 2544 | 4031 |

## క్లుప్తంగా

### ఉప్పుచెరువులో పడి వ్యక్తి మృతి

కందుకూరు: పట్టణంలోని ఉప్పుచెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. అగ్నిమాపక ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని లుంబినీవనం కాలనీకి చెందిన షేక్ ఖలీల్‌బాష(53) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం చేపలవేట కోసం ఉప్పుచెరువుకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో దిగి చేపలు పడుతుండగా, ఊబిలా ఉండే ప్రాంతంలో చిక్కుపోయి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తిరుపతయ్య తెలిపారు.

### వివక్షను వీడి సమరసతను సాధించాలి

- భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి



మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

వెంకటాచలం: వివక్షను వీడి సమరసతను సాధించాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలంలోని గొలగమూడి వద్దనున్న భగవాన్ వెంకయ్యస్వామి ఆడిటోరియంలో ఆదివారం పీటీ జగన్నాథాచారి అధ్యక్షతన నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల సమరసత సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి మాట్లాడుతూ కుల వివక్షతను వీడి సమాజాన్ని సరమసత వైపు దృష్టి మరలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలో మార్పు కోసం మార్గదర్శనం అవసరమని పేర్కొన్నారు. హిందూ ధర్మం, భారతీయత సాధించేందుకు కులాలకు అతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సమరసత సమ్మేళనం ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్, పోట్లూరు శ్రీనివాసులు, డాక్టర్ వేణు దీక్షత్, కోట సునీల్‌కుమార్, నేలనూతల శ్రీధర్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

### హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

మైదుకూరు: వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు– ప్రకాశం జిల్లాలు తలపడగా ప్రకాశం జట్టును ఓడించి గుంటూరు జట్టు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం– విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం జట్టు.. శ్రీకాకుళం జట్టును ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.

# నేనున్నాను..!

కిడ్నీ దానం చేసి ఆ తల్లి కుమారుడికి మరోసారి ప్రాణం పోస్తే..జగనన్న ఆ కుటుంబానికి చేదోడుకు నిలిచారు. కిడ్నీ ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును మొత్తం భరించడంతో పాటు ఆ కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేసి.. ఆ యువకుడ్ని ప్రభుత్వ ఉద్యోగానికి సీఎం సిఫార్సు చేశారు. కష్టంలో తమకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామంటోంది ఆ కుటుంబం

- సీఎం జగన్ చొరవతో కిడ్నీ వ్యాధి బాధితునికి భరోసా..
- కిడ్నీ మార్పిడికి రూ.10 లక్షల ప్రభుత్వ సాయం
- ప్రభుత్వ ఉద్యోగానికి సిఫార్సు



సీఎంకు తమ గోడు వినిపిస్తున్న మార్తమ్మ(ఫైల్)



తల్లీ కుమారుడు మార్తమ్మ, శ్రీనివాసులు



కిడ్నీ మార్పిడి తరువాత కలెక్టర్‌ను కలిసిన మార్తమ్మ, శ్రీనివాసులు

కొనకనమిట్ల: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేము వెలుగొండయ్య, మార్తమ్మల కుమారుడు వేము శ్రీనివాసులు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేసుకుంటూ తల్లిదండ్రులను పోషిస్తూ తమ్ముడు బాబూరావును చదివిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా కిడ్నీ దెబ్బతిందని చెప్పడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా తల్లడిల్లింది. ఇంటికి ఆదరవుగా ఉన్న కుమారుడికి చిన్న వయసులోనే కిడ్నీ దెబ్బతినడంతో ఏం చేయాలో తెలియక తీవ్రంగా మదనపడ్డారు. కుమారుడిని బతికించేందుకు తల్లీ మార్తమ్మ తన కిడ్నీ ఇవ్వడానికి ధైర్యం చేసింది. కానీ కిడ్నీ మార్చేందుకు హాస్పిటల్ ఖర్చు రూ.10 లక్షల వరకు అవుతుండటంతో ఏం చేయాలో తెలియక అయోమయ స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం పట్టణానికి వచ్చారు. తన కుమారుడు శ్రీనివాసులను తీసుకొని తల్లి మార్తమ్మ సీఎం జగన్‌ను కలిసేందుకు మార్కాపురం వచ్చారు. రోడ్డు పక్కన నిల్చొని ఉన్న వారిని గమనించిన సీఎం వారి దగ్గరకు వచ్చి పలకరించి వివరాలు తెలుసుకున్నారు.

కుమారుడిని బతికించేందుకు తన కిడ్నీ ఇస్తానని, మార్పిడికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని సీఎంకు విన్నవించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని, బీఎస్సీ నర్సింగ్ చదివిన నీ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం, కిడ్నీ దానం చేసిన తల్లివైన నీకు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆర్థిక సాయం, ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమస్యను పరిష్కరించమని ఆదేశాలిచ్చారు.

**హామీ నెరవేర్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి..**

హామీ ఇచ్చిన కొన్ని రోజుల్లోనే హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం కలెక్టర్ రూ.లక్ష చెక్కును ఇచ్చారు. ఈ తరువాత సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌లో విజయవంతంగా కిడ్నీ మార్పిడి చేశారు. ప్రస్తుతం శ్రీనివాసులు ఆరోగ్యంగా ఉన్నాడు. రాయవరంలో ఉంటున్న మాకు దరిమడుగు వద్ద ఇంటి నివేశన స్థలం ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.**

కిడ్నీ మార్పిడికి అయ్యే ఖర్చు రూ.10 లక్షలను ముఖ్యమంత్రి జగనన్న మంజూరు చేయటంతో తన కుమారుడు ప్రసుత్తం ఆరోగ్యంగా ఉన్నాడని శ్రీనివాసులు తల్లి మార్తమ్మ సంతోషం వ్యక్తం చేసింది. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు బీఎస్సీ నర్సింగ్ చదివిన శ్రీనివాసులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. దీంతో మార్తమ్మ కుమారుడిని తీసుకొని కలెక్టర్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## 15 నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు



దసరా శరన్నవరాత్రి మహోత్సావాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: త్రిపురాంతకం బాలా త్రిపుర సుందరీదేవి, పార్వతి త్రిపురాంతకేశ్వరి స్వామి ఆలయాల్లో జరిగే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను మార్కాపురం మంత్రి కార్యాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, అర్చకులు ప్రసాద్‌శర్మ, విశ్వనారాయణశాస్త్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీలవెంకటపిచ్చయ్య, శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఐవీ సుబ్బారావు, ఆలయాల ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు మల్లికార్జున్, లింగయ్య, సత్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత



కోమటికుంట వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం వాహనం



పెద్ద ఉల్లగల్లు వద్ద రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

మార్కాపురం రూరల్: మండలంలోని కోమటికుంట వద్ద అక్రమంగా తరలివెళ్తున్న రేషన్‌బియ్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు గిద్దలూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గంగిరెడ్డి తెలిపారు. కంభం నుంచి యర్రగొండపాలెం వైపునకు వెళ్తున్న బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 57 బస్తాల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 2855 కేజీల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ వాహనాన్ని మార్కాపురం రూరల్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. దాడుల్లో జి. నాగేశ్వరరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద ఆదివారం 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు తెలిపారు. దర్శి నుంచి ముండ్లమూరుకు ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బి.భవానిహర్షకి సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అశోక్, విజిలెన్స్ సీఐ రాఘవరావులు సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో అక్రమంగా తరలిస్తున్న 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని చీమకుర్తిలోని రేషన్ బియ్యం గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం వాహనాన్ని ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై యువీ కృష్ణయ్య తెలిపారు. వారి వెంట విజిలెన్స్ ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి తొట్టిలో పడి వృద్ధురాలు మృతి

తర్లుపాడు: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడిన వృద్ధురాలు గోను రమణమ్మ (80) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ నెల 3న నీటితొట్టిలో పడిపోయిన వృద్ధురాలిని కుటుంబసభ్యులు మార్కాపురానికి తరలించి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

## సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన

- వ్యవసాయానికి అండగా రైతు భరోసా
- విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



పెద్దగొల్లపల్లిలో ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమంతునిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏరాష్ట్రంలో లేని సంక్షేమ పాలన ప్రజలకు అందిస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, పేదలను ఆదుకుంటున్నారని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని పెద్దగొల్లపల్లి సచివాలయ పరిధిలో పెద్దగొల్లపల్లి, నడిపల్లి, తూర్పుపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ కన్వీనర్ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ అరుణమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి మహిళలు హారతులిచ్చి పూలు, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాల అమలు గురించి క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కొక్కరు రూ.7 లక్షలకు పైబడి లబ్ధి పొందిన పేదలు కూడా ఉన్నారని అన్నారు. ఇంకా ప్రజలకు ఏవైనా అవసరాలు ఉంటాయన్న ఉద్దేశంతో సీఎం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి గడపకు పంపుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వారి ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన చంద్రబాబునాయుడికి ఏదో ఒక విధంగా అధికారం కట్టబెట్టాలన్న ఆలోచనతో ఎల్లో మీడియా తమ శాయశక్తులా ప్రయత్నిస్తోందని చెప్పారు. ప్రజలు ఓటు ద్వారా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు, టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయానికి అన్నీ సరఫరా చేస్తున్నారన్నారు. రైతుల ఖాతాలో నేరుగా రైతు భరోసా నిధులు వేసి రైతన్నలను ఆదుకుంటున్నారని చెప్పారు. వైద్యానికి, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి ఇంటి ముంగిటకు వైద్యులు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. నాడు–నేడుతో పాఠశాలలు అభివృ ద్ధి చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి నూతన మార్పులు తెచ్చారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికి తిరిగి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయం సావిత్రి, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ నక్క అరుణ, రుద్రపాటి శోభ, యూత్ అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, సచివాలయ కన్వీనర్ మద్ది తిరుపతయ్య, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు కాస్తల బేబి, ఆర్య వైశ్య సంఘ నాయకలు చెక్కారాము, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు రుద్రపాటి రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు సానికొమ్ము వెంకటస్వామిరెడ్డి సర్పంచ్‌లు కత్తి రాజారావు, మాజీ సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ఉపసర్పంచ్ ఇట్టిం క్రిష్ణ, ఏరువ వెంకటరెడ్డి, గ్రామ కన్వీనర్ కస్తాల బాలాజి, కోటపాటి మోహన్‌రెడ్డి, దేవిరెడ్డి శంఖర్ రెడ్డి, యూత్ నాయకులు సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు దేవిరెడ్డి కృష్ణారెడ్డి, ఆంజనేయరెడ్డి, వెలుగొండా రెడ్డి, ఎలిక తిరుపతయ్య మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి

- ఆరోగ్య కార్డులు, ఇళ్లపట్టాలు పంపిణీ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం
- ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ప్రతిభ అవార్డులు, ట్రిపుల్ ఐటీ సీట్లకు యత్నిస్తున్నా
- అపుస్మా జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



హాజరైన కరస్పాండెంట్లు, అపుస్మా ప్రతినిధులు, సభ్యులు తదితరులు

ఒంగోలు: ప్రైవేట్ విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులకు ఇళ్లపట్టాలు, ఆరోగ్య కార్డుల గురించి ఇప్పటికే సీఎంతో చర్చించామని, ఆయన సానుకూలంగా ఉన్నారని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రైవేట్ విద్యా సంస్థలంటేనే ఒక దురభిప్రాయం ఉండేదని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అటువంటి దురభిప్రాయాన్ని పోగొట్టగలిగామన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో ప్రతి ప్రైవేట్ విద్యా సంస్థలోని ఉపాధ్యాయులకు కూడా ఓటుహక్కు తెచ్చుకోగలిగామన్నారు. 1400 ప్రైవేట్ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని అందుకున్నారన్నారు. నాకు రాజకీయ నాయకుడు అని చెప్పుకోవడం కన్నా టీచర్ అని చెప్పుకోవడమే గర్వంగా ఉంటుందన్నారు. విద్యా సంస్థల గుర్తింపు రెన్యువల్‌కు సంబంధించి చాలా వరకు పరిష్కరించుకోగలిగామని, ఒక చిన్నపాటి సమస్యను కూడా మరో ఒకటి రెండు సార్లు సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే దీనికి చాలా ప్రక్రియ ఉందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ కంటే ఎదిగిన వారిని చూసి ఈర్ష్య పడుతుంటారని, కానీ గురువు మాత్రం తన శిష్యుడు ఎదగాలని మాత్రమే కోరుకుంటాడంటూ గురువు ప్రాధాన్యతను వివరించారు. ప్రతిభ అవార్డులు , ట్రిపుల్ ఐటీ సీట్లలో కూడా ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అపుస్మా జిల్లా అధ్యక్షులు కె.మాధవరావు మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించి పెద్ద ప్రైవేట్ విద్యా సంస్థను స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి నేడు రాజకీయంగా కూడా ఉన్నతంగా రాణించాలని కోరుకుంటున్నామన్నారు. అనంతరం ఎంఎల్‌సీ చంద్రశేఖరరెడ్డితో పాటు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా కార్యదర్శి బి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు, ఎ.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి మల్లికారెడ్డి, గిద్దలూరు యూనిట్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, ఇతర యూనిట్ అధ్యక్షులు నక్కా శ్రీను, వెంకటేశ్వరరెడ్డ, కేశవరెడ్డి, గుంటయ్య, వెంకట్, నక్కా ప్రసాద్, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సౌకర్యాలతో భ్రమర బృందావన్ హౌసింగ్ వెంచర్



భ్రమర బృందావన్ బ్రోచర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్లు

కనిగిరి రూరల్: నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టిస్తూ, అత్యాధునిక సౌకర్యాలతో శ్రీ భ్రమర బృందావన్(వెంచర్) ప్రాజెక్టుకు కనిగిరి ప్రాంతంలో చేపట్టడం శుభ పరిణామని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీ భమర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ వారి బృందావన్‌ప్రాజెక్టు బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్, అండ్ మేనేజింగ్ డైరక్టర్ గల్లా రామచంద్రారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకుంటూ రియల్ ఎస్టేట్ రంగానికే ఆదర్శవంతంగా భ్రమర ప్రాజెక్టు నిర్వాహకులు హౌసింగ్ వెంచర్ చేపట్టడాన్ని కొనియాడారు. కనిగిరి ప్రాంతంలో భ్రమరా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టడం వల్లే ఎందరికో ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలతో చేపట్టిన శ్రీ భ్రమర బృందావన్ ప్రాజెక్టు అభివృద్ధి చెందాలని కాంక్షించారు. తొలుత కనిగిరి– గార్లపేట రోడ్డు నుంచి శ్రీ భ్రమర బృందావన్(హౌసింగ్ వెంచర్) వరకు వేసిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే బుర్రా ప్రారంభించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వాసవీ సత్రసముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సోసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, సంస్థ డైరక్టర్లు మారం చంద్రశేఖర్, శైలారెడ్డి, మురళీ కృష్ణా, ఎంపీకే లక్ష్మీపతిరాజు, ఎంఎస్ రాజు, స్వామిజీ, స్థానిక సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో
# పరిహారం పొందొచ్చు

- మోటార్ వాహనాల చట్టం–2022 ద్వారా ప్రయోజనం
- మృతి చెందితే రూ.2 లక్షలు, క్షతగాత్రులైతే రూ.50 వేలు పరిహారం

ఒంగోలు సబర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనటం ద్వారా(హిట్ అండ్ రన్) ప్రమాదాలు జరిగిన కేసుల్లో పరిహారం పొందవచ్చు. ఈ మేరకు మోటారు వాహనాల చట్టం–2022 ద్వారా బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని అందిచేందుకు దోహద పడుతుంది. అందులో భాగంగా ఎస్పీ మలికాగర్గ్ మోటార్ వాహనాల చట్టం–2022కు సంబంధించిన విధి విధానాలను ఆదివారం విడుదల చేశారు. జిల్లాలోని రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎస్పీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. వివిధ శాఖల సమన్వయంతో పోలీస్ శాఖ నష్ట నివారణ చర్యలు తీసుకుంటోంది. రోడ్డు ప్రమాదాల్లో బాధిత కుటుంబాలకు కొంత వెసులుబాటు కల్పించేలా చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోతే అలాంటి కేసుల్లో ప్రమాదవశాత్తూ మృతి చెందినా లేక క్షతగాత్రులైనా ఆయా కుటుంబాలకు పరిహారాన్ని అందించేలా మోటారు వాహనాల చట్టం–2022 దోహదపడుతుంది. మోటారు వాహనాల చట్టం 1988 సెక్షన్ 163 ప్రకారం హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీం 2022 ద్వారా నష్టపరిహారాన్ని అందించవచ్చు. ఈ చట్టం ప్రకారం ప్రమాదం జరిగిన 15 రోజుల్లోనే చెల్లించేలా కార్యాచరణ చేపట్టారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ పథకం అమలులో ఉంది. ఎవరైనా మోటారు వాహనం ఢీకొని మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడితే రూ.50 వేలు పరిహారానికి అర్హులని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన 15 రోజుల కాలపరిమితిలో క్లెయిమ్‌ల పరిష్కారాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పరిహారం పొందేందుకు స్థానిక తహసీల్దార్ లేదా మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలను సంప్రదించాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాలయంలో ప్రమాదం జరిగినప్పుడు పోలీసులు నమోదు చేసిన రిపోర్టు, ఎఫ్ఐఆర్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలి. తీవ్రమైనా గాయాల పాలైన వ్యక్తికానీ లేదా లీగల్ రెప్రజెంటేటివ్ కానీ ఫారం – 1 అప్లికేషన్‌ను సమర్పించాలి. వాటితో పాటు ఆధార్ కార్డు కానీ ఓటరు కార్డు కానీ పాన్ కార్డు కానీ జత చేయాలి. క్లెయిమ్‌దారు బ్యాంకు పాస్ బుక్, చికిత్స చేయించుకున్న హాస్పిటల్‌కు సంబంధించిన రసీదులు, ఫారం–4 తాలూకు రెవెన్యూ సబ్ డివిజనల్ అధికారి ధృవీకరించిన చట్ట పరమైన వారసుల పేరుతో కూడిన రిపోర్టు కూడా జత చేయాలి. ఇవన్నీ సమకూర్చి తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంది. పూర్తి వివరాలకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి వివరాలు తీసుకోవాలి.